క్లుప్తంగా

ఎమ్మెల్సీ ఎన్నికకు ఏర్పాట్లు పూర్తి

- 'తూర్పు'లో 747 మంది ఉపాధ్యాయ ఓటర్లు



చినవాల్తేరులో పోలింగ్ స్టేషన్‌కు దారి చూపుతూ ఏర్పాటు చేసిన బోర్డు

ఆరిలోవ: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు తూర్పు నియోజకవర్గంలో అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. గురువారం జరగనున్న పోలింగ్ కోసం చినవాల్తేరులోని ఏయూ ప్రాథమిక పాఠశాలలో పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేశారు. నియోజకవర్గంలో ఇది ఒక్కటే కేంద్రం. దీనికోసం బుధవారం పోలింగ్ సిబ్బంది కేంద్రానికి చేరుకున్నారు. ఎన్నికల అధికారులు కేంద్రంలో బూత్‌లు సిద్ధం చేశారు. ఉపాధ్యాయ ఓటర్ల కోసం కేంద్రానికి తోవ చూపే బోర్డులు ఏర్పాటు చేశారు. నియోజకవర్గ పరిధిలో 747 మంది ఉపాధ్యాయ ఓటర్లు ఉన్నారు. వారిలో 351 మంది పురుషులు కాగా.. 396 మంది మహిళా ఓటర్లు. వీరికి ఈ కేంద్రంలో నాలుగో నంబర్ రూమ్‌ను పోలింగ్ కోసం సిద్ధం చేశారు.

వీరబ్రహ్మేంద్ర స్వామి కల్యాణ వైభోగం



వీరబ్రహ్మేంద్ర స్వామి, గోవిందమాంబ కల్యాణం చేస్తున్న అర్చకులు

ఏయూక్యాంపస్: సాగర తీరంలో బుధవారం శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి గోవిందమాంబ మహాదేవి వార్షిక కల్యాణం ఘనంగా నిర్వహించారు. స్వామి విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. మహిళల కోలాట ప్రదర్శన ఆకట్టుకుంది. కార్యక్రమంలో శ్రీ కామాక్షి ఏకాంబరేశ్వర సనాతన ధర్మ పీఠం సేవా ట్రస్ట్ పండూరి సాంబమూర్తి ఆచార్య స్వామి, బ్రహ్మేంద్రస్వామి భక్తులు పాల్గొన్నారు.

చిన్నారుల నృత్యం అదుర్స్



కూచిపూడి నృత్యం చేసిన చిన్నారులతో నిర్వాహకులు

దాబాగార్డెన్స్: జీవీఎంసీ 33వ వార్డులో కొలువైన నీలమ్మ అమ్మవారి జాతర మహోత్సవాల్లో భాగంగా బుధవారం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాల్లో నగరానికి చెందిన నాట్యదీపిక కూచిపూడి అకాడమీ చిన్నారుల నృత్య ప్రదర్శన అలరించింది. అకాడమీ వ్యవస్థాపకురాలు, డైరెక్టర్ ఎల్.ఇంద్రాణి నేతృత్వంలో పలువురు చిన్నారులు చేసిన కూచిపూడి నృత్యం ఆకట్టుకుంది. ఈ సందర్భంగా నిర్వాహకులు చిన్నారులను అభినందించారు.

కుటుంబ సభ్యుల చెంతకు పశ్చిమ బెంగాల్ వాసి



హైదర్ షేక్‌ను కుటుంబానికి అప్పగిస్తున్న శ్రద్ధా టీం సభ్యులు

సీతమ్మధార: ద్వారకానగర్ ఏయూటీడీ వసతి గృహంలో ఆశ్రయం పొందుతున్న పశ్చిమ బెంగాల్ వాసి రెండేళ్ల అనంతరం కుటుంబ సభ్యుల చెంతకు చేరాడు. వివరాలివి.. పశ్చిమబెంగాల్‌లోని రాణిగంజ్ నివాసి మొహమ్మద్ హైదర్ షేక్(40) పెయింటింగ్ పని చేసేవాడు. పెళ్లయ్యాక సొంత దుకాణం పెట్టుకున్న అతను, సరిగ్గా నడపలేక అప్పులపాలయ్యాడు. ఆందోళనతో వ్యాధిగ్రస్తుడైన హైదర్‌కు ట్రీట్‌మెంట్ ఇచ్చినా పూర్తిగా నయం కాలేదు. ఈ క్రమంలో రెండేళ్ల క్రితం ఇల్లు వదిలి వచ్చేసిన అతను విశాఖ చేరాడు. ఇక్కడ ఏయూటీడీ సిబ్బంది గుర్తించి ద్వారకానగర్ టీఎస్సార్ కాంప్లెక్స్‌లోని జీవీఎంసీ ఏయూటీడీ నిరాశ్రయుల వసతి గృహానికి తరలించారు. సంస్థ అందించిన సేవలకు బాగా కోలుకున్నాడు. ఈ క్రమంలో హైదర్‌ను శ్రద్ధా సిబ్బంది వైజాగ్ నుంచి తీసుకెళ్లి బుధవారం అతడి తల్లి, భార్య, అన్నదమ్ములకు క్షేమంగా అప్పగించారు. వారు ధన్యవాదాలు తెలిపారు.



ఆరిలోవ కాలనీ శివాజీనగర్ ఆలయంలో జ్యోతిర్లింగాలకు అభిషేకాలు చేస్తున్న భక్తులు



డ్రైవర్స్ కాలనీ శివాలయంలో పూజలు చేస్తున్న మేయర్ గొలగాని హరివెంకటకుమారి తదితరులు



పాండురంగ ఆలయంలో శివ పూజలు చేస్తున్న భక్తులు




ఎంవీపీ సెక్టార్-6 ఆలయంలో ధ్వజ స్తంభం వద్ద దీపాలు వెలిగిస్తున్న మహిళలు

శంభో శంకర

భక్తిశ్రద్ధలతో మహాశివరాత్రి పూజలు

శివనామస్మరణతో మార్మోగిన శైవక్షేత్రాలు





పాండురంగ స్వామి ఆలయంలో శివలింగానికి అభిషేకం



పార్వతీముక్తేశ్వరాలయంలో పూజలు



కొత్తవెంకోజీపాలెం గౌరీ జ్ఞానలింగేశ్వర ఆలయంలో అభిషేకం చేస్తున్న అర్చకులు

ఆరిలోవ: మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా బుధవారం తూర్పు నియోజకవర్గంలోని శివాలయాలు భక్తులతో నిండిపోయాయి. శివనామస్మరణతో శైవక్షేత్రాలన్నీ మార్మోగాయి. ఆరిలోవ ప్రాంతంలోని ఆలయాల్లో వేకువజాము నుంచి భక్తులు శివుడికి భక్తిశ్రద్ధలతో పూజలు, అభిషేకాలు చేశారు. 9వ వార్డు విశాలాక్షినగర్ కైలాసనాథుని ఆలయం, జోడుగుళ్లపాలెం నాగక్షేత్రం, హనుమంతవాక శివాలయం, 10వ వార్డు రవీంద్రనగర్, ఆదర్శనగర్ శివాలయాలు, 11వ వార్డు డ్రైవర్స్ కాలనీ, కైలాసనగర్ శివాలయాలు, 12వ వార్డు పెదగదిలి, నెహ్రూనగర్ శివాలయాలు, 13వ వార్డు ఆరిలోవ కాలనీ ఆఖరి బస్టాప్ వద్ద ఆపరేషన్ కాలనీ శివాలయం, శివాజీనగర్-2లోని ఆలయాలన్నీ భక్తుల తాకిడితో రద్దీగా మారాయి. డ్రైవర్స్ కాలనీ, పెదగదిలి శివాలయాల్లో మేయర్ గొలగాని హరివెంకటకుమారి, వైఎస్సార్‌సీపీ నాయకుడు గొలగాని శ్రీనివాస్ కుటుంబ సభ్యులు శివుడికి ప్రత్యేక పూజలు చేశారు.

జగమంతా శివమయం

ఏయూక్యాంపస్: మహా శివరాత్రి పర్వదినాన్ని స్థానిక భక్తులు భక్తిప్రపత్తులతో జరుపుకున్నారు. కిర్లంపూడి లేఅవుట్‌లోని లలితా పీఠంలో సామూహిక మహన్యాసపూర్వక రుద్రాభిషేకం చేశారు. సాయంత్రం 6 గంటలకు శ్రీ లలితా సుందరేశ్వరుల దివ్య కల్యాణం, రాత్రి లింగోద్భవ సమయంలో 12 మంది దంపతులతో ప్రత్యేక అభిషేకం జరిపించారు.

నేడు అన్నాభిషేకం

గురువారం ఉదయం 10 గంటలకు మహాకుంభమేళ తీర్థ జలాలతో అభిషేకం, అన్నాభిషేక మహోత్సవానికి ఏర్పాట్లు చేశామని ఆలయ ప్రధాన అర్చకుడు కాండూరి లక్ష్మణ స్వామి తెలిపారు.

- పెదవాల్తేరు అసంగానంద ఆశ్రమంలో శ్రీ విష్ణు సేవానంద గిరి స్వామి పర్యవేక్షణలో శివరాత్రి వేడుకలు జరిగాయి. పంచామృత అభిషేకాలు, ఊరేగింపు, గంగా, యమున, సరస్వతి, కృష్ణ, గోదావరి నదీ జలాలతో అభిషేకం, రాత్రి లింగోద్భవ కాలంలో క్షీరాభిషేకం, రుద్రాభిషేకం, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. చినవాల్తేరులోని దుర్గామల్లికార్జున స్వామి, పాండురంగ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిగాయి..

ప్రసాద వితరణ

ఆర్.కె.బీచ్ వద్ద ఉదయం భక్తులకు వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు ప్రసాదం పంపిణీ చేశారు. ఒక బహుళ జాతి సంస్థ తమ ఆర్వో వాటర్ ప్లాంట్లను ఆర్.కె.బీచ్ వద్ద ఏర్పాటు చేసి భక్తులకు నీరు సరఫరా చేసింది.

భక్తజన కోలాహలం

ఎంవీపీకాలనీ: ఎంవీపీ కాలనీ సెక్టార్-6లోని సిద్ధివినాయక పార్వతీముక్తేశ్వరాలయంలో ఏకవారాభిషేకాలు, ద్వాదశ జ్యోతిర్లింగాలకు అభిషేకాలు, ఏకరుద్రాభిషేకాలు నిర్వహించారు. తులసికోట, ధ్వజ స్తంభాల వద్ద మహిళలు పెద్ద ఎత్తున పూజలు చేశారు. ఎంవీపీ కాలనీలో ప్రసిద్ధ శివాలయం కావడంతో భక్తుల కోలాహలం నెలకొంది.

- ఎంవీపీ కాలనీ సెక్టార్-9లో శివాలయం, సెక్టార్-4లోని నవగ్రహ దేవాలయంలో మహాదేవుడికి అభిషేకాలు, పూజలు చేశారు. ఆలయ కమిటీ ప్రతినిధులు భక్తులకు ప్రసాద వితరణ చేశారు.
- అప్పుఘర్ తీరంలోని సీతారామ సాగర లింగేశ్వరుడికి భక్తులు పూజలు, అభిషేకాలు జరిపారు.



సత్యసాయి ప్రేమసదన్ శివరాత్రి వేడుకల్లో పాల్గొన్న మహిళలు



ప్రేమసదన్‌లో శివలింగానికి పూజలు

శ్రీసత్యసాయి ప్రేమసదన్‌లో ఘనంగా వేడుకలు

శ్రీ సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో ఎంవీపీ కాలనీలోని సత్యసాయి ప్రేమసదన్ మందిరంలో మహాశివరాత్రి వేడుకలు ఘనంగా నిర్వహించారు. భక్తులచే సామూహిక ఫలరసామృత అష్టోత్తర శత కలశ ఏకాదశి రుద్రాభిషేకం, బిల్వార్చన, అమ్మవారికి కుంకుమార్చన, రుద్రహోమం, పూర్ణాహుతి, పూజలు వేదపండితుల మంత్రోచ్ఛారణల మధ్య జరిపించారు. శ్రీ పార్వతీపరమేశ్వర కల్యాణ మహోత్సవం, పురవీధుల్లో ఊరేగింపు కార్యక్రమాలు వైభవంగా జరిగాయి. వేదపఠనం, ప్రత్యేక భజనలు, సాముగరిడీ, పల్లకీ సేవ నిర్వహించారు. కార్యక్రమాల్లో సంస్థ ప్రతినిధులు డీవీపీఎస్ రాజు, పీఆర్ఎస్ఎన్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.



ఆర్.కె.బీచ్ వద్ద భక్తులకు ప్రసాదం అందిస్తున్న సంస్థ ప్రతినిధులు



కిర్లంపూడి లేఅవుట్‌లో లలితా సుందరేశ్వరుల దివ్య కల్యాణంలో పాల్గొన్న భక్తులు

ప్రత్యేక పూజలు, అభిషేకాలు

మద్దిలపాలెం: కొత్త వెంకోజీపాలెం శ్రీ జ్ఞానానంద ఆశ్రమం, గౌరీ జ్ఞానలింగేశ్వరాలయం, కేఆర్ఎం కాలనీ, ఇసుకతోట, హెచ్‌బీ కాలనీ శివాలయాల్లో వేకువజాము నుంచి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. కొత్త వెంకోజీపాలెం ఆలయంలో ప్రధానార్చకుడు ఆరవెల్లి సూర్యప్రకాశ్ శర్మ సారథ్యంలో అర్చక బృందం రామకృష్ణ శర్మ, సుబ్రహ్మణ్యశాస్త్రి, బాలభాస్కర శర్మ, ప్రభాకరశర్మ, సాయి భక్తుల గోత్రనామాలతో అర్చనలు చేశారు. ఉదయం నుంచి ఉపవాసాలతో పూజలు చేసిన మహిళలు, భక్తులు శివనామస్మరణ జరిపారు. కార్యక్రమంలో దేవస్థాన ఈవో నాయుడు, ఆలయ సిబ్బంది రాంబాబు, రామాంజనేయులు, గ్రామ సేవా సంఘం, ఇతర కార్యవర్గ సభ్యులు, స్థానికులు పాల్గొన్నారు.

నాడు ప్రశాంతం.. నేడు అస్తవ్యస్తం



పిచ్చి మొక్కలతో నిండిన పాత రామకృష్ణాపురం

- పిచ్చి మొక్కలకు ఆవాసంగా పాత రామకృష్ణాపురం
- అసాంఘిక కార్యకలాపాలకు అడ్డా
- అధికారులు పట్టించుకోవాలని స్థానికుల విన్నపం

ఆరిలోవ: ఒకప్పుడు కమ్మల పాకలతో ప్రశాంతంగా ఉండే ఆ గ్రామం.. ఇప్పుడు పిచ్చి మొక్కలతో నిండి అస్తవ్యస్తంగా మారింది. సుమారు ఎకరం విస్తీర్ణం గల ఈ స్థలం ప్రస్తుతం అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. విశాఖ కేంద్ర కారాగారం ఎదురుగా ఉన్న రామకృష్ణాపురం పరిస్థితి ఇది. ఈ గ్రామంలో సుమారు 700 వరకు కమ్మల పాకలు ఉండేవి. హనుమంతవాక నుంచి అడవివరం వరకు బీఆర్‌టీఎస్ రోడ్డు నిర్మించినప్పుడు సుమారు 12 ఏళ్ల కిందట జీవీఎంసీ అధికారులు ఇక్కడ రోడ్డుకు అడ్డంగా ఉన్న గ్రామంలో కమ్మల పాకలను తొలగించి ప్రత్యామ్నాయం కల్పించారు. అక్కడ రోడ్డు నిర్మాణం చేపట్టారు. ఈ నేపథ్యంలో బీఆర్‌టీఎస్ రోడ్డుకు ఓ పక్క కొంత ఖాళీ స్థలం ఉండగా.. రెండో పక్క కొన్ని నివాసాలు మిగిలిపోయాయి. వాటిని తొలగించలేదు. ఇప్పుడా ఇళ్లన్నీ కలిసి మరో గ్రామంగా ఏర్పడ్డాయి.



జీవీఎంసీ స్వాధీనం చేసుకున్న స్థలంలో కాలిన నీటి పైపులు

పార్కు ఏర్పాటుకు విజ్ఞప్తి

ఇదిలా ఉండగా.. ఓ పక్క ఖాళీగా ఉన్న స్థలాన్ని జీవీఎంసీ స్వాధీనం చేసుకుని దాని చుట్టూ కంచె నిర్మించి వదిలేసింది. దీన్ని సామాజిక అవసరాల కోసం వినియోగిస్తామని అప్పట్లో అధికారులు ప్రకటించారు. అప్పటి నుంచి అధికారులు పట్టించుకోకపోడంతో దానిలో ఓ జీవీఎంసీ కాంట్రాక్టర్ వాటర్ పైపులు వేసి వదిలేశాడు. ఇక్కడ ఐదేళ్ల కిందట అగ్నిప్రమాదానికి గురై కొన్ని పైపులు కాలిపోయాయి. వాటిని తొలగించకుండా అలాగే వదిలేశారు. ఈ స్థలం ఖాళీగా ఉండటంతో ఏపుగా, దట్టంగా పెరిగిన పిచ్చి మొక్కలు కొందరికి అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారాయి. మద్యం తాగడం, గంజాయి పీల్చడంతోపాటు ఇతర కార్యకలాపాలు ఇక్కడ సాగిస్తున్నారని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ స్థలాన్ని శుభ్రం చేయించి సామాజిక అవసరాల్లో భాగంగా పార్కు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. దీన్ని పార్కుగా తయారు చేస్తే సెంట్రల్ జైల్‌లో ఖైదీలను కలవడానికి వచ్చినవారు కొంతసేపు సేదతీరడానికి, బీఆర్‌టీఎస్ రహదారిలో ప్రయాణించే వారికి ఆహ్లాదంగా నిలుస్తుందని భావిస్తున్నారు.

సముద్ర స్నానాలకు పక్కా ఏర్పాట్లు



జోడుగుళ్లపాలెం బీచ్‌లో ఏర్పాట్లు పరిశీలిస్తున్న ద్వారకా ఏసీపీ నర్సింహామూర్తి

ఆరిలోవ: మహాశివరాత్రి సందర్భంగా రాత్రంతా జాగరణ చేసే భక్తులు మరుసటి రోజు ఉదయం సముద్ర స్నానాలు చేయడం పరిపాటి. దీన్ని దృష్టిలో పెట్టుకొని జీవీఎంసీ అధికారులు, నగర పోలీసులు భక్తుల సౌకర్యం, రక్షణ కోసం సముద్ర తీరాల వద్ద పక్కా ఏర్పాట్లు చేశారు. ఆరిలోవ పోలీస్ స్టేషన్ పరిధిలోని జోడుగుళ్లపాలెం, సాగర్‌నగర్, రుషికొండ తీరాల్లో స్నానాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ప్రమాదం జరగకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. అన్ని బీచ్‌ల వద్ద బోట్లు సిద్ధం చేసి, వాటిలో గజ ఈతగాళ్లను నియమించారు. రుషికొండ నుంచి జోడుగుళ్లపాలెం వరకు బీచ్‌ల్లో సుమారు ఆరిలోవ పీఎస్ నుంచి 40 మంది పోలీసులతో పాటు ఏఆర్, మెరైన్ పోలీసులు బందోబస్తు కోసం సిద్ధం చేసినట్లు ఆరిలోవ సీఐ హెచ్.మల్లేశ్వరరావు తెలిపారు. స్నానాల అనంతరం మహిళలు దుస్తులు మార్చుకోవడానికి ప్రత్యేకంగా టెంట్లు ఏర్పాటు చేశామన్నారు. భక్తులు సముద్రం ఒడ్డునే పుణ్య స్నానాలు చేసుకోవాలని కోరారు.

ఏర్పాట్లు పరిశీలించిన ఏసీపీ

శివరాత్రి జాగరణ స్నానాలకు వెళ్లే భక్తుల కోసం బీచ్‌లో నిర్వహించిన రక్షణ ఏర్పాట్లను బుధవారం ద్వారకా ఏసీపీ అన్నెపు నర్సింహామూర్తి పరిశీలించారు. ఆరిలోవ సీఐ మల్లేశ్వరరావు, ఎస్ఐ రాందాస్, ట్రాఫిక్ ఎస్ఐ శ్రీకాంత్, సిబ్బందితో కలిసి ఆయన జోడుగుళ్లపాలెం, సాగర్‌నగర్, రుసికొండ బీచ్‌లను సందర్శించారు.

గజ ఈతగాళ్లు, పోలీసులతో చర్చించి అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కేటాయించిన బీచ్‌లలో మాత్రమే స్నానాలకు దిగాలన్నారు. గజ ఈతగాళ్లతో పాటు మెరైన్ పోలీసులను సిద్ధం చేశామన్నారు. భక్తుల కోసం అంబులెన్స్‌లు, వైద్య సిబ్బంది ఆయా బీచ్‌ల వద్ద అందుబాటులో ఉంటారని ఏసీపీ చెప్పారు.

వీరభద్ర స్వామికి విశేష పూజలు



ఏఎస్పీ కాలనీలో వీరభద్ర స్వామి ఆలయం వద్ద బారులు తీరిన భక్తులు



అలంకరణలో వీరభద్ర స్వామి

మద్దిలపాలెం: ప్రతి ఏటా మహాశివరాత్రి పర్వదినాన తప్ప మరో రోజు భక్తుల తాకిడి ఉండని వీరభద్రస్వామి ఆలయం బుధవారం భక్తజనంతో కిక్కిరిసిపోయింది. మద్దిలపాలెం ఏఎస్పీ కాలనీలోని ఈ ఆలయానికి భక్తులు ఉదయం నుంచి తండోపతండాలుగా తరలివచ్చారు. మేళతాళాలు, ఊరేగింపుగా వచ్చి స్వామికి విశేష పూజలు చేశారు. 16వ వార్డు పాత వెంకోజీపాలెంలోని వీరబాబు ఆలయం వద్ద ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి, మధ్యాహ్నం భక్తులకు మహా అన్నదానం పట్టారు. కార్యక్రమంలో శ్రీ రాధాకృష్ణ సేవా సంఘం సభ్యులు పాల్గొన్నారు.

అలరించిన ఘంటసాల గానావధానం

సీతంపేట: మహా శివరాత్రి సందర్భంగా ఘంటసాల ఆరాధకుల టెలిగ్రామ్ గ్రూప్ ఆధ్వర్యంలో అక్కయ్యపాలెం లలితానగర్‌లో గల స్వరాలయ స్టూడియోలో బుధవారం ఘంటసాల ఆరాధనోత్సవాలు ఘనంగా నిర్వహించారు. డాక్టర్ సయ్యద్ రహమతుల్లా ఆధ్వర్యంలో పలువురు గాయనీ గాయకులు ఘంటసాల ఆలపించిన ఆపాత మధుర గీతాలు ఆలపించి ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశారు. నందగోపాల్ ఘంటసాల వేషంలో హావభావాలలతో, గానంతో అలరించారు. సోమయాజుల సత్యవేణి ఘంటసాల సావిత్రి వేషంతో మెప్పించారు. ఘంటసాల పాటలతో నందగోపాల్ ప్రదర్శించిన బుర్రకథ ఆకట్టుకుంది. డాక్టర్ సయ్యద్ రహమతుల్లా చేసిన గానావధానం సభికులను ఆశ్చర్యపర్చింది. కార్యక్రమంలో గాయనీగాయకులు రామ్మూర్తి, కల్యాణి, అంబిక, రాధ తదితరులు పాల్గొన్నారు.

ఆహార భద్రత గాలికి..

- ఆహారంపై అవగాహన కార్యక్రమాలు చేపట్టని అధికారులు
- కార్యాలయానికే పరిమితమైన మొబైల్ టెస్టింగ్ అండ్ అవేర్‌నెస్ వాహనం



ఆహార భద్రతపై అవగాహన కల్పించాల్సిన వాహనం

బీచ్‌రోడ్డు: ఆహార భద్రత నియమాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తల కోసం ఆహార భద్రత అధికారులు అవగాహన కార్యక్రమాలను నిర్వహించాల్సి ఉంది. కూటమి ప్రభుత్వంలో ఈ కార్యక్రమాలను అధికారులు గాలికి వదిలేశారు. గడిచిన పదేళ్లుగా రాష్ట్రంలో ఆహార భద్రత విషయంలో చివరి స్థానంలో ఉంది. ఈ విషయాన్ని గ్రహించిన గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రూ.40 లక్షలతో మొబైల్ టెస్టింగ్ అండ్ అవేర్‌నెస్ వాహనాన్ని జిల్లాకు కేటాయించింది. దీనిలో ఒక ఎల్ఈడీ టీవీ, ఆహార శ్యాంపిల్‌ను సేకరించే పరికరాలు ఉంటాయి. ఈ వాహనంతో కాలేజీలు, వీధి వ్యాపారుల వద్దకు వెళ్లి ఆహార భద్రత నియమ నిబంధనలపై అవగాహన కల్పించాలి. ఎక్కడ కలుషిత ఆహారంపై ఫిర్యాదు వస్తే అక్కడికి వెళ్లి ఈ వాహనంతో శ్యాంపిల్‌ను తీసుకురావాలి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఈ వాహనం కార్యాలయానికే పరిమితమైంది. ఒక్కసారి కూడా ఈ వాహనం ద్వారా ప్రజలకు అవగాహన కల్పించడం కానీ.. కలుషిత ఆహారాన్ని తరలించటం కానీ చేయలేదు. దీంతో రూ.40 లక్షలు వృథా అవుతున్నాయి. ఈ విషయంలో సంబంధిత అధికారుల స్పందన ఎలా ఉంటుందో వేచి చూడాల్సిందే.